కెనెడీ తెడ్డులు రెండు తెచ్చి నేలమీద పెడుతూ పోగా, రాస్ అడుగు తీసి అడుగు వేస్తూ నెమ్మదిగా గట్టుమీది కెక్కాడు. ఇసుకమీదికి వెళ్ళగానే, ఇద్దరూ నిల్చున్న పళంగా నేలకొరిగి సొమ్మసిల్లిపడిపోయారు. అలాగే నిద్రపోయారు.

గంటం గడిచింది. ఉదయమే నౌరూ వాసులు నలుగురొచ్చి వాళ్ళని మేల్కొలిపారు. "మీకు ఉత్తరం తెచ్చాను" అన్నాడొకడు స్వచ్ఛమైన ఇంగ్లీషులో. అది న్యూజార్జియా ప్రాంతంలో పనిచేస్తున్న న్యూజీలాండ్ పదాతిదళం కమాండరు వ్రాసినది. ఈజాబు తెచ్చిన వారివెంట తన శిబిరానికి రమ్మని వ్రాశాడు. సకాలంలో సహాయం అందడం అంటే అక్షరాలా ఇదే. ఇంకో పూటో గంటో ఆలస్యం అయితే పరిస్థితి యెలా ఉండేదో వూహించటం కష్టం కాదు. అప్పటికే మెక్‌మహన్ ఒంటిమీద కాల్చులు పుండ్లయి కుళ్ళసాగాయి. రాస్ చెయ్యి అతని తొడ అంతలావుగా వాచిపోయింది. కెనెడీ దాదాపు స్పృహలేకుండా ఉన్నాడు. ద్వీపవాసులు కెనెడీని దోనెలోపల పడుకోబెట్టి, జపాన్ విమానాల వాళ్ళకు కనబడకుండా తాటాకులు కప్పారు. శిబిరం చేరిన కొద్ది గంటలకు ఒక పి. టి. బోటు వచ్చింది. "హేయ్ జాక్ :" అన్నారెవరో బోటుమీంచి చనువుగా.

"ఇన్నాళ్ళు యెక్కడ దఘోరించావు ?" అని కేకవేశాడు కెనెడీ ఓపిక చేసుకుని.


"నీకోసం భోజనం తెచ్చాం: రా."

"అబ్బే, వొద్దు. ఇప్పుడే కొబ్బరికాయ పుచ్చుకున్నాను" అన్నాడు కెనెడీ యాదాలాపంగా. జరిగిన ఉపద్రవం, అది కలిగించిన సంక్షోభం, పెట్టిన యాతనా ఉభ…కూ తెలుసు. ఇంకో నిమిషం తరువాత కెనెడీ బోటుమీదికెగిరాడు. అక్కడున్నవారిని ఆప్యాయంగా గాఢంగా కౌగలించుకున్నాడు. వాళ్ళంతా న్యూజార్జియా కేంద్రంలో తన తోటివాళ్ళే. అక్కడనుంచి నౌరూలు ఆ బోటును పిట్టల దీవికి పట్టించారు. అక్కడ ఉన్నవారందరినీ ఎక్కించుకుని అర్ధరాత్రివేళ టార్పెడో బోటు నావిక కేంద్రానికి సాగిపోయింది. బోటులో ఉన్నవారి ఉత్సాహంలా ఆ బోటు పరవళ్ళు తొక్కుతూ పరుగెత్తింది. ఓపిక చాలక పడివున్నవారు కాస్తకోలుకునేందుకు బోటు సర్జను పంపిన బ్రాందీతో ఒకతను పూటుగా కడుపునింపేసుకున్నాడు. ఉత్సాహం పట్టలేక తలక్రిందులుగా కూర్చున్నాడు. ఆ తరవాత మిషనరీ శిక్షణ పొందిన నౌరూ ద్వీపవాసులలో బొద్దుగా ముద్దుగా ఉన్న ఇద్దరిని కౌగలించుకుని గొంతెత్తి పాడాడు.

నౌకాదళ కేంద్రంలో వారంతా కెనెడీకి బ్రహ్మాండమైన స్వాగతం ఇచ్చారు. ఆఫీసర్లకూ, నావికులకూ అందరికీ అతనిపై గౌరవాభిమానాలు పెరిగాయి. కోటీశ్వరుడి బిడ్డకి ఉండవలసిన అహంలేదనీ, అంతటి నిగర్వి లేడనీ మెచ్చుకున్నారు. జలగండం గడిచి బతికి బయటపడ్డ నావికులు పదకొండుగురూ తమతమ అనుభవాలూ, తమ నందరినీ గట్టెక్కించడానికి కెనెడీ పడిన శ్రమ, తామంతా నిస్పృహతో, నీరసంతో పడిపోయినా, ప్రయత్నం సాగించడంలో కెనెడీ చూపిన దీక్ష, ఓర్పు వర్ణించారు. కథలూ గాథలుగా అవి ఆ కేంద్రం అంతటా వ్యాపించాయి. నౌకాదళం వారు కెనెడీకి ఆ యేడాది "పర్పుల్ హార్ట్" పతకంతోబాటు "నేవీ అండ్ మెరైన్ కోర్" పతకంకూడా ఇచ్చి సత్కరించారు. □□□

[మూలం: జేమ్స్ ఎం. బరన్స్.
అనువాదం: ముళ్ళపూడి వెంకటరమణ]





# బాత్ ఏక్ రాత్ కీ

కె.వి.ఎస్. అచ్యుతవల్లి

"అబ్ క్యా మిసాల్ దూఁ మైఁ తుమ్హారే షబాబ్ కీ" పాడుకుంటూ ఎదుటిబెర్తుమీది అందమైన అమ్మాయిని చూసి నాలుక్కరుచుకున్నాడు లోకనాథం. వెన్నెలరోజులు. ఆకాశంలో చెదురు మదురుగా మబ్బుతునక లుండటంవల్ల వెన్నెల మసకమసకగా, చిందరవందరగా, జాడజాడలుగా భూమిమీద పరుచుకుంటోంది. రైలు ముందుకుపోతూంటే తాటిచెట్లూ చిన్న చిన్న గడ్డి దుబ్బులూ వెనక్కుపోతున్నాయి.

లోకనాథం ఎదుటి అమ్మాయినే పరీక్షగా చూశాడు. ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో, లోకనాథం అంతవరకూ, ఒంటిగా ప్రయాణిస్తున్నాడు. ఆ ఏకాకితనం భరించలేని ఆ కంపార్ట్ మెంటు, ఒక అందమైన అమ్మాయిని అతనికి జంటగా చేర్చింది. లోకనాథం తనవేపు పరీక్షగా చూడడం గమనించిన ఆ అమ్మడు తల కిటికీ బయటకు పెట్టి, ఆకాశాన్ని చూస్తూ కూర్చుంది.

లోకనాథం ఈ అమ్మాయి ఏ స్టేషన్ లో యెక్కిందా అని ఆలోచిస్తున్నాడు. నెల్లూరు వచ్చేవరకూ లోకనాథం మెలకువగానే వున్నాడు. నెల్లూరులో కాస్త మగతగా నిద్రపట్టింది. లోకనాథానికి మెలకువగా వున్నంతసేపూ ఏవో పాటలు పాడుకోవటం అలవాటుంది. అలాగే జాగ్రదవస్థలోకి వస్తూనే, పై పాట పాడుకోబోయి, ఆ అమ్మాయిని చూసి ఆపేశాడు. అనుకోకుండానే, అతనిచేయి ఒకసారి క్రాపింగ్ని సరిచేసింది. శాటిన్ చారల పైజామా, కట్ బనీను, చల్లని బయటగాలి, లోపలి ఫాన్ గాలి, అతని శరీరాన్ని గిలిగింతలు పెడుతున్నాయి. కాసేపు ఆ అమ్మాయిని పరీక్షగా చూసేసరికి, అతనికి ఆవులింత లొచ్చాయి. అనుకోకుండానే అతని తల ప్రక్కకు వాలింది. కళ్ళు అరమూతలు పడ్డాయి....

అందమైన ఆ అమ్మాయి, అర్థరాత్రి వేళ ఒంటిగా ప్రయాణిస్తోందంటే అందుకు కొంత కారణం వుండాలి! అదే అనుకున్నది, లోకనాథం సుప్తమనస్సు!

తెల్లవారబోతోంది. రైలు బెజవాడ చేరింది. లోకనాథం లేచి ముఖం కడుక్కొని, "కాంటీన్"లోనికి వెళ్ళి, కాఫీ ఫలహారం తీసుకుని వొచ్చాడు. వస్తూనే, ఆ అమ్మాయి ముఖం నీరసంగా వుండటం గమనించి మళ్ళీ కాంటీన్ లోకిపోయి, కాఫీ, ఇడ్లెన్లు పార్శిలు కట్టించి ఆ పార్శిలు పట్టుకొచ్చి, ఆ అమ్మాయిముందు పెట్టాడు. ఆ అమ్మాయి ముఖం చిన్నబోయింది.

"తీసుకోండి!" అన్నాడు ప్రార్థనగా.

"వొద్దు!" సన్నగా అంది ఆ అమ్మాయి.

"నా గెస్ట్గా తీసుకుందుకు మీ కెందుకు అభ్యంతరం?"

"నాదగ్గర డబ్బులున్నాయి. ఒకళ్ళ గెస్ట్గా ఆహార పానీయాలు గడుపుకోవలసిన స్థితి నాకేం పట్టలేదు." దుఃఖంగా అంది.

"మనది భారతదేశం! ఆధ్యాత్మికంగా వున్నతమైన మన భారతదేశంలో, అతిధి పూజ, మనవిధ్యుక్తధర్మం! మీకుతెలియనిది కాదనుకుంటాను. మీరు చదువుకున్నారనుకుంటాను."

బి. ఎ. చదవాలని వుండేది."

మరి ఎందుకని చదవలేదు?"

"కారణం మీకు కనపట్టంలేదా?"

ఆమెవేపు చూశాడు. సాదాచీటీ పువ్వుల పరికిణీ, వెలిసిపోయిన వోణీ వేసుకుంది. చేతులకి నల్లనిమట్టిగాజులు.

"వూఁ! అయితే ఎంతవరకు చదువుకున్నారు?"

"సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ అయ్యాను. గర్ల్సుస్కూలులో పని చేస్తున్నాను,

"అల్లాగా! ఎంతవరకూ వెడుతున్నారు?"

"రాజమండ్రి వెడతాను. అక్కడ మా స్నేహితురాలుంది."

"మరి అమ్మా నాన్నా?"









"వున్నారు! అందరికీ వున్నారు. నాకూ వున్నారు. నాజీతం అంతా తీసుకుంటారు. ఇంట్లో ఖర్చుపెట్టేస్తారు. ఆఖరికి నాకో మంచి చీర కొనుక్కుందామన్నా డబ్బుండదు. నా తరువాత ఆరుగురు చెల్లెళ్ళున్నారు. వాళ్ళకి అక్షరమ్ముక్కలు అంట లేదు. ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళు ఇల్లుపట్టరు. మాకు తాతా బామ్మా వున్నారు. తాతకు గంజాయిదమ్ము అలవాటు! బామ్మకు నల్లమందు అలవాటు! మా నాన్నకు పేకాట అలవాటు. మా అమ్మకి పిల్లల్ని కనటం అలవాటు! చాలాకాలంనించీ ఈ అలవాట్లు నిరాటంకంగా జరుగుతున్నాయి మా ఇంట్లో. వాళ్ళ మారని అలవాట్లలో నా సంపాదన వృధా చెయ్యటం నా పొరపాటు! అని తెలుసుకుందుకు నాలుగేళ్ళు పట్టింది నాకు. తెలుసుకున్నాక, అది తెలుసుకోవటం మూలంగా తప్పించుకుందామనే పాటులో నానా అగచాట్లూ పడ్డాను. చివరికి ఎవ్వరితో చెప్పా పెట్టాకుండా ఇలా వచ్చేస్తున్నాను."

లోకనాథం జాలిపడ్డాడు. ఆ అమ్మాయి వేపు తదేకంగా చూశాడు.

"కాఫీ తీసుకోండి చల్లారిపోతోంది!" అన్నాడు. అంతకన్నా ఏం మాట్లాడాలో లోకనాథానికి తెలియదు.

"చూడండి! మనం ప్రయాణీకులం! ఎవరి స్టేషన్ లో వాళ్ళం దిగిపోతాం. ఆ మాత్రం దానికి ఈ యిచ్చిపుచ్చుకోడాలు దేనికి?"

"ముందే చెప్పాను. అతిధి మర్యాద పాటించమని!"

"ఈ పట్టాలు ఎప్పుడైనా కలుస్తాయంటారా?"

"ఎప్పటికీ కలవ్వు! ఒకవేళ కలిసినా రైలు బోల్తాపడుతుంది."

"అది నిజం! కలవనిదానికి ఈ ఇచ్చిపుచ్చుకోవటం దేనికి!"

"సారీ!" తేలిగ్గా నవ్వాడు లోకనాథం. ఆకాశం అంతా పంచరంగుల్లో కనపడింది లోకనాధానికి. వేయికోకిలలు కోటి లతాల కంఠాల నావేశించి, రైలుపెట్టెచుట్టూ ఎగురుతూ పాడుతున్నట్లు విన్పించింది లోకనాధానికి.

"తీసుకోండి! కాఫీ ఫలహారం." అన్నాడు మళ్ళీ.

"మీరో!"

"నేను తీసుకునే, మీకోసం తీసుకు వచ్చాను."

"నన్ను గమనించారన్న మాట ...... రాత్రంతా గమనించారన్నమాట!" లజ్జతో కందిపోయింది.

ఆ లజ్జాన్వితను గమనించి ముగ్ధుడై పోయాడు లోకనాథం.


నీకు లజ్జవేయటం లేదా?" అంటాడు దేవదాసు.


"నా లజ్జని నువ్వు కప్పెట్టుతావనే ఆశతో వొచ్చాను. నాలజ్జ ఒక్కనీముందే దేవదా!" అంటుంది పారూ.

"పారూ!" అన్నాడు లోకనాథం.

"నాపేరు లీల!" అంది సున్నితంగా.

"లీలా! నాపేరు లోకనాథం. లిటరేచర్ ఆనర్స్ ప్యాసయ్యాను. బాగా పాడుతాను. నాకు రఫీ పాటలంటే యమ యిష్టం!"





"మీ అర్హతలు ఎంచటానికి నా కర్హత లేదు. నాకు పాటలంటే చాలా యిష్టం! అందులో లత పాటలంటే మరీ ఇష్టం!"

ఇంతలో టిక్కెట్టు కలక్టరు వొచ్చాడు. లోకనాథం దర్జాగా తన టిక్కెట్టు తీసి యిచ్చాడు.

"మీది?" అన్నాడు టిక్కెట్టు కలక్టరు.

లీల గాభరాగా పెట్టెవెతికింది. టిక్కెటు లేదు. పర్సుకూడా లేదు.

"అరే! ఎక్కడోపోయిందండీ!" అంది లీల బిక్కగా.

"ఇల్లాంటి సరుకుని చాలాచూశాను. పద డర్టీక్రీచర్!" జబ్బపుచ్చుకో పోయాడు టికెట్ కలెక్టర్.

"ఆగండి!" అన్నాడు లోకనాథం.

"ఏమిటి!"

"ఆమె నాభార్య! తెనాలిలో కలుసుకుంది. పొరపాటున పర్సు పారేసుకుంది. దాని కింత అవమానంచేయాల్నా? ఎంతో చెప్పండి డబ్బు ఇచ్చేస్తున్నాను." లీల కృతజ్ఞతగా చూసింది లోకనాథం వేపు.

"సారీ! ముందు చెప్పారు కారేం?" అన్నాడు టికెట్ కలెక్టరు.

"చెకింగ్ ఎలావుందో చూద్దామనిపించింది!" అన్నాడు ధీమాగా లోకనాథం.

"భలేవారే! వస్తానండి!" అంటూ ఎక్సైన్ పుచ్చుకుని దిగిపోయాడు టికెటు కలక్టరు.

"రక్షించారు మీరు!" అన్నది లీల.

"ఇకముందుకూడా రక్షించాలిఅనులీలా!"

లీల సిగ్గుగా మొగ్గలా నవ్వింది. లోకనాథం తన్మయత్వంలో లీల భుజాలు పుచ్చుకుని దగ్గరకు తీసుకోబోయాడు.......

రైలు ఒక్క కుదుపుతో ఆగింది. లోకనాథం తల కిటికీ అడ్డకమ్మీకి తగిలి టక్కుమని మెలకువ వచ్చింది. స్టేషనంతా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సందడిగా వుంది. లోకనాథానికి కళ్ళు మండుతున్నాయి. స్టేషన్‌లోకి చూశాడు. తెనాలి స్టేషన్ అది! అయితే, ఇందాకట్నించీ, తను కలగన్నాడన్నమాట! తనలో తనే నవ్వుకుంటూ "లెవేటరీ"లోకి వెళ్లాడు.

మళ్ళీ వస్తూ ఆ అమ్మాయివేపు పరీక్షగా చూశాడు. ఆ అమ్మాయి బెర్తుమీదవొంపుగా పడుకుని, నిద్రపోతోంది. అతని కలలో కన్పించినట్లు, చీటీ పువ్వుల పరికిణీ, వోణీ కాకుండా, పల్చని లేత గులాబీరంగు చీర కట్టుకుంది. దోసెడు వెడల్పు జరీ అంచు వుంది ఆ చీరకి. చేతులకి నల్లని మట్టి గాజులుకాక, అయిదారు జతల మిలమిల మెరిసే బంగారు గాజులున్నాయి. సన్నగా యెత్తుగా వున్న ముక్కుకి రవ్వల ముక్కుపుడక మెరుస్తూంది. చెవులకి రవ్వల దుద్దులున్నాయి. మెళ్ళో అయిదారు పేటల గొలుసులు గజిబిజిగా మెరుస్తున్నాయి. ఆమె చెంపల నునుపులో రవ్వల దుద్దుల తళుకు ప్రతిఫలిస్తోంది. లోకనాథం తనకు వచ్చిన కలను తల్చుకుని నవ్వుకుంటూ, తన బెర్తుమీదకు పోయి కూర్చున్నాడు. వొంటినిండా నగలతో, జంటలేకుండా ప్రయాణిస్తున్న ఆ యువ్వనివేపు సాలోచనగా చూశాడు. రైలు బయలుదేరింది. ప్రాతఃకాలపు చల్లని గాలి హాయిగా చల్లగా జో కొడుతోంది........

హఠాత్తుగా మెలకువ వచ్చింది ఆ యువతికి. గుమ్మం దగ్గరకు వెళ్ళింది. రైలు స్పీడందుకుంది. కొలకలూరు, దుగ్గిరాల మొదలయిన స్టేషన్లు వెనక్కుపోతున్నాయి. ఆ యువతి కాసేపు లోకనాథం వేపు పరీక్షగా చూసింది. లోకనాథం కళ్ళు సన్నగా తెరిచి ఆ యువతిని పరీక్షిస్తున్నాడు. యువతి లోకనాథం నిద్రపోతున్నాడని ధ్రువపరుచుకుంది. మెల్లిగా తలుపుతీసింది. పమిటచెంగు నడుముచుట్టూ తిప్పి బిగుతుగా మొలలో చెక్కుకుంది. కళ్ళుమూసుకుంది. అస్తమిస్తున్న చంద్రుడి వెన్నెల్లో ఏదో కాలువ కట్ట కనిపించింది. రైలు "టకా టక్ టకా టక్" అంటూ చప్పుడవుతోంది. ఇంక ముందుకురికి అగాధంలా కన్పించే కాలవలో పడదామని, ముందుకు వంగబోయింది. లోకనాథం బలమైన రెండుచేతులూ ఆమె భుజాలను పుచ్చుకుని వెనక్కు లాగేయి! తలుపును మూసేశాడు. ఆమె చేసేదిలేక ఏడుస్తూ బెర్తుమీద కూలబడిపోయింది.

"దేనికా నిరాశ?" అన్నాడు లోకనాథం. ఆమె పల్చటి పమిటలోంచి మాంగల్యాలు మెరుస్తూ కన్పించాయి.

"నా బ్రతుక్కి నిరాశకాక మరేముంటుంది?" ఆమె దుఃఖంగా అంది.

"బ్రతుకు బరువును పంచుకుంటే తేలికౌతుంది. మీ కభ్యంతరం లేకపోతే మీచరిత్ర వినటం నాకేమీ కష్టం కాదు! మీరు చూడబోతే ఉన్నత కుటుంబంలోంచి వచ్చిన వారల్లే వున్నారు" అన్నాడు లోకనాథం.

"మీరు పొరపాటు పడుతున్నారు. నేను ఉన్నత కుటుంబంలోంచి రాలేదు. మేము చాలా పేదవాళ్ళము. కాని నాలో కూడా, ఆశలూ ఆశయాలూ వుంటాయని గమనించ లేదు గౌరీపతి."



"ఎవరా గౌరీపతి?"

"ఒక లక్షాధికారి. ఒకరోజు వీధి కొళాయి దగ్గర్నించి నీళ్లు తెచ్చుకుంటోంటే నన్ను చూశాట్ట! మర్నాడు మానాన్నని వొచ్చి అడిగాడు. వెంటనే మా నాన్న సంబరపడి ఆయనకిచ్చి పెళ్ళిచేశాడు."

"అదృష్టం మిమ్మల్ని కోరి వరించిందన్నమాట!"

"కాదు. నన్ను కోరి వధించింది. అదృష్ట దేవత! మా అమ్మకీ, నాన్నకీ ధనలోభం వల్ల డబ్బుమీద ఆశేకాని, నామనసు అక్కర్లేకపోయింది. నేను హిందీ విశారద ప్యాసయ్యాను. పిల్లలకి ప్రైవేట్లు చెప్పుకుంటూంటే యాభయి రూపాయలు వొచ్చేవి. నాన్న కోమటికొట్లో గుమాస్తాగా పనిచేసేవాడు. ఆయన తెచ్చే నలభయ్ రూపాయలతో మా సంసారం చక్కగానే గడిచిపోయేది. అలాంటిది ధనం మీది వ్యామోహంతో నన్ను అయిదువేలు పుచ్చుకుని, గౌరీపతి పరం చేశారు. వాళ్ళకి నేను బిడ్డననేసంగతి విస్మరించారు. వాళ్ళుకోరిన డబ్బు వాళ్ళ చేతుల్లో పడింది కనుక, వాళ్ళకి నేనేమయినా అక్కర్లేదన్నమాట."

"అలా అనుకోకండి. వాళ్ళు ఇదివరలో సంసారం గిజాటుగా నడుపుకోవటం అలవాటు,అయినవారు. వాళ్ళున్న పరిస్థితిలో, మీకు వేలుపోసి వరుణ్ణికొనితేగల తాహతు లేదు. కోరివచ్చిన వారి కోరిక తీర్చకపోవటంలో వాళ్ళకు లబ్ధి కనిపించలేదు. ఇంక జమీందారీ ఫాయాలో మీ జీవితం ఆనందయుతంగా నడుస్తుందని ఈపెళ్ళి చేసివుంటారు. అంతమాత్రంచేత తల్లిదండ్రులకి కడుపుకోత చేస్తారా! కట్టుకున్న భర్తని, కాంతలని కాలితో, నేలరాస్తారా!" ఉద్వేగంగా అన్నాడు లోకనాథం.

"ఆయన భర్తకాదు. నాపాలిటి యమదూత. పట్టి అనుమానం మనిషి. బయటకు పోతూ తలుపులన్నిటికీ తాళాలు వేసి మరీ పోతాడు. నేను కిటికీదగ్గర నించోకూడదు. తోటలో సరదాగా పచార్లు చేయకూడదు. నేను ఆయనకి ఒక గుప్తధనం లా కనపడతాను. నేనొక సజీవ ప్రాణిని అనీ, నాకూ నలుగురిలో తిరగాలనీ, సినిమాలూ, వింతలూ చూడాలనీ వుంటుందనే సంగతి ఆయనకి యెప్పుడూ, నేను బ్రతికుండగా జ్ఞాపకం రాదు."

"ఆయనకి అంత ఖాయిదాలో పెట్టాలనిపించడానికి మీ అందమే కారణమనుకుంటాను." అనకుండా వుండలేక పోయాడు లోకనాథం.

ఆ యువతి గాభరాగా నవ్వింది.

"నా అందమే కాకుండా ఆయనవయస్సు కూడా కారణమే" అంది.

"ఎంతవుంటుందిట శ్రీవారి వయస్సు?" జిజ్ఞాసగా అడిగాడు లోకనాథం.

"షుమారుగా అరవైఅయిదు. అరవై ఆరు దాకా వుండొచ్చును" నిబ్బరంగా చెప్పింది ఆ యువతి.

నిర్ఘాంతపోయాడు లోకనాథం. ఆమె వేపు దీనంగా చూశాడు.

"ఇప్పుడు చెప్పండి. నా బ్రతుకులో నిరాశకాక మరేముంటుందో!"

ఏం చెప్పగలడు! తనుమాత్రం! కాని ఒకటి మాత్రం అన్నాడు.

"అదే స్థితిలో నేనున్నట్టయితే, నా ఆస్తంతా వెచ్చించి, మీకు కుత్రమయిన

సంబంధాన్ని వెతికి పెళ్ళిచేసివుండే వాణ్ని" ఆయువతి కళ్లు టటాలున మెరిశాయి.

"ఇప్పుడేం మించిపోయింది? నా దగ్గర యాభయి నవరసుల బంగారం వుంది. అది అమ్మి పెట్టి ఆ శుభ్రమైన సంబంధం ఏదో వెతికి మీరు పెళ్ళిచేయకూడదా ఏమిటి" అన్నది.

లోకనాథం ఆలోచిస్తున్నాడు. ఏం చెప్పాలో అతనికి తెలియటంలేదు. బాగా తెల్లవారిపోతోంది. రైలు బెజవాడ చేరబోతోంది. "టకాటక్ టకాటక్" అంటూ పట్టాలు మారుతోంది.

"ఏం మాట్లాడరేం! అంత మాత్రానికేనా నా మానాన నన్ను చావనీకుండా బ్రతికించారు! అడుగో రైలు ప్లాటుఫారమ్ చేరబోతోంది. ఈపాటికి, మా ఆయన పోలీసు రిపోర్టుఇచ్చే వుంటారు. రైలు ఆగగానే, సి. ఐ. డి. లు వచ్చి నన్ను పట్టుకపోతారు. ఒకసారి పారిపోవటానికి ప్రయత్నించానుకనుక, నన్నింకా ఎక్కువ ఖాయిదాలో పెడతారు. పచ్చని పచ్చిక బయళ్ళూ, నీలాకాశంలో ఎగిరే పిట్టలనూ చూట్టానికి నేను నోచుకోలేదు. ఈపాటికి, చచ్చి స్వర్గంలో రంభా, మేనకా, తిలోత్తమల సరసన నృత్యం చేయాల్సిన నా ఆత్మని ఈ భౌతిక ప్రపంచపు నరకయాతనలని భరించమని సజీవంగా నిలపెట్టారు. నన్నిందుకేనా చావనీకుండా బ్రతికించింది చెప్పండి!"

"చూడండీ! మీపేరూ?"

"నాపేరు ఇందిర" అన్నది ఆ యువతి దుఃఖంగా.

"చూడండీ ఇందిరగారూ! మీరునన్ను [illegible]రిగా అపార్థం చేసుకున్నారు. మిమ్మల్ని నేనెందుకు రక్షించానో, మీకంటే బాగా నాకు తెలుసును. నేను లిటరేచర్ ఆనర్స్ ప్యాసయ్యాను. ఎక్కడో అక్కడ ఉద్యోగం వస్తుంది. కనుక, నేను నా కాళ్ళమీద నిలబడగలను. అందుచేత నేనెవరికీ బెదరనవసరంలేదు. అందుకని, మీరు అంగీకరిస్తే...."

"అంగీకరిస్తే?" నమ్మలేనట్టుగా చూసింది ఇందిర.

"మిమ్మల్ని ఇందూ! అని పిలవాలని వుంది...." అనేశాడు లోకనాథం.

"నిజంగా!" కళ్ళు పెద్దవి చేసింది ఇందిర.

"నిజం ఇందూ!"

"మీరే నా లోకం!" అంది ఇందిర తియ్యగా.

"నాపేరే లోకనాథం!" అన్నాడు లోకనాథం ముద్దుగా. ఇందిరలేచి అతనికాళ్ల మీదకు వంగబోయేంతలో, లోకనాథం, ఆమె రెండు భుజాలూ పుచ్చుకుని గాఢంగా తన హృదయానికి హత్తుకోబోయాడు. "ప్లాట్ఫారమ్ మీదికి మద్రాస్ మెయిల్ వచ్చుచున్నది" అనే ఎనౌన్స్మెంట్ మైక్లో బిగ్గరగా వినపడుతోంది. లోకనాథం మెల్లిగా కళ్ళువిప్పి ఎదరకుచూశాడు. వళ్ళంతా నీరసంగా వుంది. మెయిల్ప్లాట్ఫారమ్ మీద ఆగింది. పందుం పుల్లలూ, కాఫీ, టీలు అన్నీ ఒకే గొంతులో ప్రయాణీకులని హెచ్చరిస్తున్నాయి.

"ఏమండీ! లేవండీ! స్టేషనొచ్చింది!" ఎదుటిబెర్తుమీది యువతి లేచి నించుని అంటోంది. లోకనాథం ఆశ్చర్యపోయాడు. మెల్లిగా లేచి కూర్చుని బద్ధకంగా ఆవులించాడు.



## పాఠకులకు సరికొత్త పసందుగ

సుప్రసిద్ధ పసందైన కథారచయిత లు పఠాభిగారు 'జ్యోతి' పత్రికలో పస చెయ్యడానికి దయతో అంగీకరించారని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

వారి పసందైన పలుకులు జనవరి నెలలో విడుదల అయి ఆంధ్ర పాఠకహృదయాకాశంలో కన్నుల పసందుగా విహరించ గలవు.

"అబ్బ! దిగండీ! అంటోంది ఆ యువతి చిలిపిగా.

"అప్పుడే అధికారంచెలాయిస్తున్నావా?" అందామనుకున్నాడు లోకనాథం. కాని అప్పర్ బెర్తుమీంచి, తెల్లని రెండుపాదాలు క్రిందికి వ్రేలాడటం చూసి నిర్ఘాంతపోయాడు. ఆ పాదాలుగల ఆరడుగుల పొడుగున్న అందమైన శాల్తీ బద్ధకంగా క్రిందికి దిగింది. ఆ యువతి ముసిముసిగా నవ్వుకుంటూ, లెదరు సూటుకేస్, బెడ్డింగ్, పళ్ళబుట్టలూ క్రిందికి దించటంలో నిమగ్నమైపోయింది. అతను టర్కిష్ టవల్ భుజంమీద వేసుకుని క్రిందికి దిగి, వెయిటింగ్ రూంకేసి నడిచివెళ్ళిపోయాడు. ఆ అందమైన అమ్మడు క్రిందికి దిగి పోటోతూంది.

"మాడమ్! మీ పేరేమిటి! ఎక్కడో చూసినట్టుంది." అన్నాడు లోకనాథం.

"అప్పుడే మర్చిపోయావా లోకం!" అంది ఆ యువతి నవ్వి.

"అదే, నువ్వు ఇందిరవా, లీలవా అని...."

"ఆబ్బే! మన బ్యాచ్లో ఆ పేరుగల అమ్మాయిలు లేందే, లోకం! నాపేరు వెంకమాంబ. నా నెంబరు "థర్టీవన్". సెకండ్ క్లాసు వచ్చింది నాకు. నీకు ఫస్ట్ క్లాసు వొచ్చిందిగా? వస్తా. గుడ్బై!" వెళ్ళిపోయింది వెంకమాంబ. రైలుకదిలింది.

"ఇన్సాన్ బన్గయా హై కిరస్కో మెహతాబుకి — అట్ క్యామిసాల్ దూ," సీటుమీద కాళ్ళు బార్లా చాపుకుని హాయిగా, ఫ్రీగా పాడుకుంటూ ప్రయాణిస్తున్నాడు లోకనాథం. ◻◻◻